

శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై దంపతులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిఎం వెంట మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా ఉన్నారు.



భేటీ

సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సోమేష్ కుమార్‌ను సీనియర్ ఐపిఎస్ అధికారులు బుధవారం బిఆర్‌కెఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ రిజర్వేషన్లపై సర్కారు కుస్తీ

- బిసి రిజర్వేషన్ల ఖరారుకు
- ఓటర్ల తొలగింపు, చేరికలూ కీలకమే
- ఊపందుకున్న ప్రక్రియ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్ ఎన్నికలకు కీలకఘట్టం మొదలైంది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల మేయర్లు, చైర్ పర్సన్ల రిజర్వేషన్ల ఖరారుకు ప్రక్రియకు సంబంధించి అధికారులు శ్రీకారం చుట్టారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 2011 జనాభా లెక్కలే ప్రాతిపదిక కావడంతో పాత, కొత్త కార్పొరేషన్లు, మున్సిపాల్టీల జనాభా వివరాలను క్రోడీకరిస్తున్నారు. ఇక మిగిలిన బిసి రిజర్వేషన్ల కోసం ఓటర్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నందున తాజాగా జరుగుతున్న ఓటర్ల చేరికలు, తొలగింపులు కీలకంగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో పురపాలక శాఖ అధికారులు బీసీ ఓటర్లకు సంబంధించి ఒక అంచనాకు వచ్చినప్పటికీ తుది జాబితా వచ్చాక స్పష్టత రానున్నది. ఈలోపు 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్ణయించాల్సిన ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లకు తుదిరూపం ఇచ్చే పనిలో పడ్డట్టు సమాచారం. మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల వారీగా ఆ వర్గాల జనాభా, మొత్తం జనాభాలో వారి శాతాన్ని లెక్కిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 19 కార్పొరేషన్లుండగా ఒక ఎస్సీ జనరల్, ఒక ఎస్సీ మహిళ, ఒక ఎస్టీ జనరల్, మూడు బీసీ జనరల్, మూడు బీసీ మహిళ, ఐదు మహిళా జనరల్, ఐదు అన్‌రిజర్వ్‌డ్ ఉన్నాయి. తెలంగాణలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్టీ జనరల్‌కు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ జనరల్‌కు, జీహెచ్‌ఎంసీ బీసీ జనరల్‌కు, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా జనరల్ కు కేటాయించారు. వరంగల్ , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లు జనరల్ కేటగిరీ కింద ఉన్నాయి. నాడు ఆరు కార్పొరేషన్లుండగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడు మున్సిపాల్టీలను కార్పొరేషన్లుగా మార్చడంతో మొత్తం 13 అయ్యాయి. ప్రస్తుతం రిజర్వేషన్లను ఖరారు చేసే ముందు 13 కార్పొరేషన్లలో ఎస్సీ, ఎస్టీ జనాభాను మొదట లెక్కిస్తారు. ఆ తర్వాత మొత్తం కార్పొరేషన్లలో ఉన్న జనాభాలో ఎస్సీల శాతం, ఎస్టీల శాతం ఎంతుందో అంచనా వేస్తారు. ఏ కార్పొరేషన్లో అయితే ఎస్సీలు, ఎస్టీలు ఎక్కువ శాతముంటే ఆ కార్పొరేషన్లు వారికి దక్కనున్నాయి.

ఇక మున్సిపల్ చైర్ పర్సన్ల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎస్టీ జనరల్ 2, ఎస్టీ (మహిళ) 2, ఎస్సీ జనరల్ 10, ఎస్సీ (మహిళ) 10, బీసీ జనరల్ 27, బీసీ (మహిళ) 26, జనరల్ (మహిళ) 41, అన్‌రిజర్వ్‌డ్ 40 కేటాయించారు. తెలంగాణలో మహబూబాబాద్, దేవరకొండ, అచ్చంపేట్ ఎస్టీలకు దక్కగా, ఎస్సీలకు మధిర, పరకాల, ఇబ్రహీంపట్నం, హుస్నాబాద్, భూపాలపల్లి, పెద్దఅంబర్‌పేట్, కొల్లాపూర్, జమ్మికుంట కేటాయించారు. తెలంగాణ ఏర్పడే నాటికున్న మున్సిపాల్టీలకు తోడు పెరిగిన మున్సిపాల్టీలతో ప్రస్తుతం మొత్తం 128 మున్సిపాల్టీలున్నాయి. కొత్త మున్సిపాల్టీల జనాభాను కూడా పరిగణనలోకి తీసుకొని కేటాయింపులు జరపనున్నారు. పాత, కొత్త మున్సిపాల్టీల్లో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 2011 జనాభా లెక్కలు అందుబాటులో ఉండడంతో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్టు సమాచారం.బీసీల రిజర్వేషన్ మాత్రం ఓటర్ల తుది జాబితా వచ్చిన తర్వాతే చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న



10 కార్పొరేషన్లు 120 మున్సిపాల్టీలతో పాటు ఎన్నికలు లేని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల జనాభాను, ఓటర్లను రిజర్వేషన్ల కోసం ప్రాతిపదికగా తీసుకోనుండడం గమనార్హం. ఈ సారి కేటాయించే రిజర్వేషన్లు రెండు దఫాలు అంటే పదేండ్ల పాటు వర్తించనుండడం గమనార్హం. కీలకమైన నాలుగు రోజులు

బీసీ రిజర్వేషన్లకు కార్పొరేషన్ లేదా మున్సిపాల్టీలో ఓటర్ల శాతం పరిగణనలోకి తీసుకుంటుండడంతో ఓటర్ల జాబితా కీలకం కానున్నది. ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపులు కూడా బీసీలకు కేటాయింపులపై ప్రభావం చూపించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనితో ఆయా రాజకీయ పార్టీల్లోని నాయకులు, ముఖ్యంగా బీసీ నాయకులు తమ అనుచరులు, వర్గం ఓట్లు ముసాయిదాలో ఉన్నాయో లేదో అని తరచి చూసి చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు. బీసీ ఓటర్లను తక్కువ చేసి చూపించేందుకుగాను కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఇతర బోగస్ ఓట్లను చేర్పించే ప్రయత్నాల్లో ఉన్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి.

టాలీవుడ్ ప్రొడ్యూసర్ కొడుకు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 31 అర్ధరాత్రి పోలీసుల విధులకు ఆటంకం కల్గించారని టాలీవుడ్ ప్రొడ్యూసర్‌పై కేసు నమోదు చేయడమే కాకుండా, అతని తనయుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో డిసెంబర్ 31న ఈవెంట్‌లో 'బ్యూటిఫుల్' సినిమా ప్రమోషన్ చేస్తామని చెప్పి ప్రొడ్యూసర్ నట్టికుమార్ వద్ద ఈవెంట్ మేనేజర్ సుమన్ డబ్బులు తీసుకున్నాడు. అయితే ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా రాంగోపాల్ వర్మ రావాల్సి ఉండగా రాలేదు. సినిమా ప్రమోషన్‌నూ చేయలేదు. అంతేకాకుండా, ప్రొడ్యూసర్ కొడుకు క్రాంతికుమార్ కారును పార్కింగ్ చేస్తామని చెప్పి తాళాలు తీసుకున్న సిబ్బంది మళ్లీ ఇవ్వలేదు. దాంతో క్రాంతికుమార్ వారితో గొడవ పడ్డాడు. సమాచారం అందుకున్న పంజాగుట్ట పోలీసులు అక్కడికెళ్లి ఇరువురికీ సర్ది చెప్పే ప్రయత్నం చేయగా, క్రాంతికుమార్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. దాంతో క్రాంతికుమార్‌ను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న క్రాంతికుమార్ తండ్రి ప్రొడ్యూసర్ నట్టికుమార్ తన అనుచరులతో పిఎస్‌కు చేరుకుని పోలీసులతో గొడవకు దిగారు. దీంతో అతనిపైనా కేసు నమోదు చేసి చేశారు.

పోలీసులే నా కుమారుడిపై దాడి చేశారు : టాలీవుడ్ ప్రొడ్యూసర్ నట్టికుమార్

పంజాగుట్ట పోలీసులే తన కుమారుడిపై దాడి చేశారని టాలీవుడ్ ప్రొడ్యూసర్ నట్టి కుమార్ ఆరోపించారు. కంట్రీ క్లబ్ ఈవెంట్లో పార్కింగ్ విషయంలో గొడవ జరుగుతుందంటూ క్రాంతి తనకు ఫోన్ చేస్తే.. డయల్ 100కు కాల్ చేయమని చెప్పినట్టు వివరించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సర్ది చెప్పాల్సింది పోయి తన కుమారుడిపై దాడి చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై డిజిపిని కలిసి వివరించినట్టు తెలిపారు. సినిమా ప్రమోషన్ కోసం తన వద్ద డబ్బులు తీసుకున్న ఈవెంట్ మేనేజర్ సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నట్టికుమార్ కోరారు.

చిన్నారిపై లైంగికదాడి

అర్ధరాత్రి తల్లి పక్క నుంచి అపహరణ

పరారీలో నిందితుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అమానుష ఘటన జరిగింది. గతంలో హన్మకొండలో జరిగిన మాదిరిగానే.. తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారిని అర్ధరాత్రి అపహరించి లైంగిక దాడికి ఒడిగట్టాడు ఓ దుర్మార్గుడు. ఈ ఘటన మహాముత్తారం మండలంలోని కోణంపేటలో బుధవారం జరిగింది. మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ బోనాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కోణంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ నాలుగేళ్ల కుమార్తెను పక్కలో వేసుకుని డిసెంబర్ 31న రాత్రి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మెలకువ వచ్చి చూస్తే పక్కలో చిన్నారి కనిపించలేదు. కుటుంబీకులంతా రాత్రి మొత్తం వెతికారు. తెల్లవారుజామున సమీపంలో ఉన్న పత్తి చేనులో నుంచి చిన్నారి ఏడుస్తూ బయటకొచ్చింది. లైంగిక దాడికి గురై ఒళ్లంతా గాయాలతో ఉన్న చిన్నారిని చూసి వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని బాలికను ఆస్పత్రికి తరలించారు. చిన్నారి చెప్పిన వివరాల మేరకు కుటుంబీకులు మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో రాస కొమరయ్యపై ఫిర్యాదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. అతనిది భూపాలపల్లి మండలం నాగారం గ్రామం. నిందితుడి ఆచూకీ కోసం నాలుగు క్లూస్ టీంలను ఏర్పాటు చేసి గాలింపు ముమ్మరం చేశారు.

ముగ్గురు పిల్లలుసహా తల్లి ఆత్మహత్యాయత్నం

ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు

పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శీతలపానియంలో పురుగుల మందు కలిపి ముగ్గురు పిల్లలకు తాగించి తానూ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది ఓ మహిళ. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సిద్ధారంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దారం ఎస్సీ కాలనీకి చెందిన గోళ్లమూడి మారేశ్‌- జమలమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కూడా గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన జమలమ్మ పురుగుల మందును శీతలపానియంలో కలిపి ఇద్దరు కుమార్తెలు రేష్మ, వర్షిత, కుమారుడు భరత్‌కు తాగించి, తానూ తాగింది. అది గమనించిన కుటుంబీకులు వెంటనే సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిసింది.



క్యాంపు రాజకీయాలు నాతో కుదరవు

- ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడించేందుకు కుట్ర జరిగింది
- ప్రజల విశ్వాసం ఉన్న వారికే టికెట్లు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే ఎన్నికల్లో కొంత మంది నమ్మక ద్రోహం చేసి వెన్నుపోటు పొడిచారని, క్యాంపు రాజకీయాలు తనతో కుదరవని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లిలోని దినేష్ ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తలతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రి ఈటెల, మాజీ మంత్రి, టిఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి బసవరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ.. డబ్బులు, మద్యానికి ఓట్లు పడవన్నారు. నిజాయితీగా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి పని చేసే వారికే ఓట్లు వేస్తారని చెప్పారు. ప్రజల విశ్వాసం, సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న వారికే టిఆర్ఎస్ టికెట్లు ఇస్తుందన్నారు నాయకులను గెలిపించేందుకు కార్యకర్తలు ఎంత కష్టపడతారో తనకు తెలుసని, అమ్ముడు పోనిది ఆత్మగౌరవం మాత్రమేనని అన్నారు. నమ్మినవారు మోసం చేస్తే బాధ అనిపిస్తుందని, తిన్నింటి వాసాలు లెక్కపెట్టేవారి వల్ల మనసు గాయపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడూ పేదల పక్షమేనని, పొరపాటున కూడా ఒకరి దగ్గర చేయి చాచలేదని అన్నారు. దొంగదెబ్బ తీయడం చేత కాదని, ధర్మంగా కొట్లాడటం మాత్రమే తనకు తెలుసని అన్నారు. గెలిచిన వాళ్లు విశ్వాసంగా ఉండాలని చెప్పారు. కొంతమంది నాయకులు గెలువక ముందు ఓ విధంగా.. గెలిచిన తర్వాత మరో విధంగా ఉంటారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లలో తన ప్రమేయం ఉండదని, రాష్ట్ర యూనిట్‌గా రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుందని అన్నారు. ఈసారి ఎన్నికల్లో చాలా కఠినంగా ఉంటానని చెప్పారు. జమ్మికుంట, హుజూరాబాద్‌లో ప్రతి రోడ్డు, ఇస్తున్న ప్రతి నీటి బొట్టూ తాను ఇచ్చిందేనన్నారు. ఎమ్మెల్యే, ఎంపి కంటే కౌన్సిలర్‌గా గెలవడం చాలా కష్టమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్థానం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సహకార సంఘాల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎంపిపి మమత, జెడ్పిటిసి డాక్టర్ శ్రీరాంశ్యాం, మార్కెట్ చైర్మెన్ పొనగంటి శారద తదితరులు ఉన్నారు.

అనురాగ్ ఇన్స్టిట్యూషన్స్‌లో అంతర్జాతీయ సమావేశం

ఇంజనీరింగ్ విద్యలో పరివర్తనపై 5 నుంచి 8వ తేదీ వరకు సదస్సు

పాల్గొననున్న ఇంజనీరింగ్ నిపుణులు, మేధావులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులు, పరివర్తనపై ప్రధానంగా చర్చించనున్నారు. వివిధ దేశాలకు చెందిన ఇంజనీరింగ్ నిపుణులు, మేధావులు సదస్సుకు హాజరుకానున్నారు. ఇండో యూనివర్సల్ కోలోబరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ (ఐయుసిఈఈ) సహకారంతో ఇది నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్, చైర్మన్, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ సదస్సు ఎంతో ముఖ్యమైందని తెలిపారు. అమెరికా, భారతదేశాల ఇంజనీరింగ్ విద్య నిపుణులు, పారిశ్రామిక వేత్తల ఆలోచన ఫలితంగా ఐయుసిఈఈ ఏర్పడిందన్నారు. భారతదేశంలో ఇంజనీరింగ్ విద్య, పరిశోధనల ద్వారా ప్రపంచ ఔచిత్యాన్ని మెరుగుపరచడం, అధ్యాపకులు, విద్యార్థుల పాఠ్యాంశాల అభివద్ధితో పాటు మెరుగైన బోధనా సాంకేతికతలను అభివద్ధి చేయడమే ముఖ్యోద్దేశమని పేర్కొన్నారు. లెర్నింగ్ మెథడాలజీస్, ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్,బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ లెర్నింగ్(కత్రిమ మేధా)ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆగ్మెంటెడ్ మరియు వర్చువల్ రియాలిటీ వంటి అభివద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల చర్చల సమ్మేళనమని ఏజిఐ కార్యదర్శి, కరస్పాండెంట్ నీలిమా తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కెటి రామారావు, సబితా ఇందిరా రెడ్డి, మల్లా రెడ్డి తదితరులు హాజరవుతారని ఐసిటిఇఇ 2020 సదస్సు చైర్ డాక్టర్ జి. విష్ణు మూర్తి తెలిపారు. కాగా ఈ సదస్సులో దేశ, విదేశాల నుంచి పదిహేను వందల మంది ప్రతినిధులు పాల్గొననున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ, అధ్యాపకులు, ఇంజనీరింగ్ విద్య పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని, 200 పేపర్ ప్రెసెంటేషన్స్ చేయనున్నట్లు చెప్పారు. మాజీ నాస్కామ్ చైర్మన్ వ్యవస్థాపకుడు బి.వి.ఆర్ మోహన్ రెడ్డి, సైయంట్ లిమిటెడ్ ఛైర్మన్ దీపక్ గాడియా, సోలార్ కుక్కర్ ఇంటర్నేషనల్ ఆదిత్య భట్నాగర్, బోర్డర్స్ ఇండియా ఇంజనీర్స్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ అగర్వాల్ మిడిల్‌బరీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ డాక్టర్ షాలిని గోపాలకష్ణన్ తదితరులు కీలకోపన్యాసం చేయనున్నట్లు తెలిపారు.

గాంధీ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గాంధీ విగ్రహం ఎడమ చేతిని విరగ్గొట్టారు. కొంత మంది అర్ధరాత్రి మద్యం మత్తులో విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీందర్ గ్రామంలో గ్రామస్తులను విచారించారు. నిందితులను పట్టుకుంటామని చెప్పారు.



ధ్వంసమైన గాంధీ విగ్రహం

హైదరాబాద్‌లో వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో బుధవారం వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, మాసబ్ ట్యాంక్, లక్డీకాపూల్, నాంపల్లి, బేగంపేట్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో జడివాన కురిసింది. నాంపల్లిలో భారీ వర్షం కారణంగా నుమాయిష్ ఎగ్జిబిషన్ ప్రారంభంఆలస్యమయింది. ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లు వర్షానికి తడిసిపోయాయి. వర్షం నీరు భారీగా చేరడంతో దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అసలే.. గత వారం రోజులుగా వీస్తున్న చలిగాలులకు వర్షం తోడవడంతో నగర ప్రజలు వణికిపోతున్నారు.

టిఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు : భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రధాని మోడీ మతపరైన రాజకీయాలు చేస్తుంటే...రాష్ట్రంలో పోలీసులను అడ్డుపెట్టి కెసిఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. ఇద్దరు కలిసి రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారు" అని టిపిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు టిఆర్ఎస్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వనపర్తి ఎంపిపి శంకర్‌నాయక్‌తో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...గతంలో కాంగ్రెస్‌లో ఉండి ఇతర పార్టీలోకి వెళ్లిన నేతలంతా తిరిగి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బడుగు,బలహీన, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టిఆర్ఎస్ పార్టీలో నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఉండదని అన్నారు. కుటుంబ, దోపిడీ పాలన చేస్తూ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తోందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. నిరుద్యోగులకు ఇస్తానన్న భృతి ఎటు వెళ్లిందని ప్రశ్నించారు. రుణమాఫీ, రైతు బంధు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళామని అన్నారు. మన్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడితే టిఆర్ఎస్ నేతలు పిచ్చి విమర్శలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికలకు భయపడుతున్నానని ప్రచారం చేశారన్నారు. 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తానెందుకు ఎన్నికలకు భయపడతానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ వాళ్ళను ఉపయోగిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను అణిచివేస్తున్నారని, అందుకు నిరసనగా త్వరలోనే జైల్ బరో నిర్వహిస్తామన్నారు. అనంతరం మాజీ ఎంపిపి శంకర్ నాయక్ మాట్లాడుతూ...కాంగ్రెస్ నుండి ఎంపిపిగా ఎన్నికైన తరువాత కొన్ని అనివార్య కారణాల వల్ల టిఆర్ఎస్‌లో చేరాల్సి వచ్చిందన్నారు. టిఆర్ఎస్ పార్టీలో మూడు సంవత్సరాలు ఉన్నా..ఏ రోజు సంతోషంగా లేనని అన్నారు. టిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, అందుకే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చానన్నారు. టిఆర్ఎస్ పార్టీలో చేరితే పనులు, పదవులు ఇస్తామని చెప్పి పార్టీలోకి తీసుకున్నారని, తీరా పార్టీలో చేరిన తరువాత కనీసం విలువ కూడా ఇవ్వడం లేదని అన్నారు. కాంగ్రెస్‌ను వీడిన నాయకులంతా తనలాగే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలనుకుంటున్న కార్యకర్తలు, నాయకులను టిఆర్ఎస్ నేతలు ప్రలోభాలకు గురిచేసి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

సర్కార్ ఖజానాకు మద్యం కిక్కు...

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సరం వేడుకలు రాష్ట్ర ఖజానాకు భారీ కిక్కునిచ్చింది. 2019 చివరిరోజు, 2020 సంవత్సరం తొలి రోజునే మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. సాధారణంగా సగటున రోజుకు రూ.60 కోట్ల మేర మద్యం అమ్ముడుపోయేది. కొత్త ఏడాది సంబరాల నేపథ్యంలో గత రెండ్రోజుల్లోనే రూ.436 కోట్ల అమ్మకాలు చోటుచేసుకోవడం గమనార్హం. అంటే రోజుకు సగటున రూ.220 కోట్ల మేర జరిగింది. డిసెంబర్ 30, 31 తేదీల్లో రూ.436 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయినట్టు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులే చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై రూ.20 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని సర్కారు అంచనా వేస్తున్నది. 2018, డిసెంబర్ 31న రూ.338 కోట్లు, 2017, డిసెంబర్ 31న రూ.100 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది కంటే ఈసారి ఆరున్నర రెట్లు పెరిగినట్టు అధకారులు చెప్పారు. మద్యం అమ్మకాలే కాకుండా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లోనూ ప్రభుత్వానికి కలిసొచ్చింది. డిసెంబర్ 31, జనవరి ఒకటి రాత్రి వరకు 3000 మందిపై కేసులు పెట్టారు. అలాగే 3,148 మంది వాహనదారులకు పోలీసులు చలానాలు విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 230 ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఒక్క హైదరాబాద్‌లోనే 2000 కేసులు పెట్టారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 951 కేసులు, సైబరాబాద్ పరిధిలో 873 కేసులు నమోదయ్యాయి. .

అర్ధరాత్రి ఒంటిగంట వరకూ..

డిసెంబరు 31 అర్ధరాత్రి ఒంటిగంట వరకు అమ్మకాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది మద్యం ప్రియులకు మరింతగా ఉపయోగపడింది. రెండు వారాల క్రితం ప్రభుత్వం 10 శాతం మేర మద్యం ధరలు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో సుమారు రూ. 300 కోట్ల నుంచి రూ. 400 కోట్ల ఆదాయం వస్తుందని ఎక్సైజ్ శాఖ అంచనా.

అపరిమిత అమ్మకాలపై ప్రతిపక్షాల గుర్రు

రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించకుండా అపరిమితంగా విక్రయించడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. మద్యం అమ్మకాలను నియంత్రించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో రిలే నిరహారదీక్ష చేపట్టిన విషయం విదితమే. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడానికి మద్యానికి బానిసలుగా చేయడం సరికాదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కె.ఎన్.ఆశాలత, కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. మద్యం సేవించి మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. లైంగికదాడులను సర్కారే ప్రోత్సహిస్తున్నట్టుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. మాజీ మంత్రి డి.కె. అరుణ సైతం మద్యానికి వ్యతిరేకంగా నిరసనదీక్ష సైతం చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

డైరీ ఆవిష్కరణలో మంత్రి వేముల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు రోడ్లు, భవనాలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆర్అండ్‌బి శాఖకు చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు బుధవారం మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ల అసోసియేషన్ డైరీని, 2020 ఏడాది క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రోడ్లు,భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్, రోడ్లు,భవనాల శాఖ ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఆర్అండ్‌బి (రాష్ట్ర రహదారులు)ఈఎన్‌సీ రవీందర్‌రావు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) డైరెక్టర్ జనరల్ భిక్షపతి, టీజీవో నేతలు క్రిష్ణ యాదవ్, సత్యనారాయణ తదితరులున్నారు.



ఆవిష్కరణ

తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వివర్స్ సొసైటీ లిమిటెడ్ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను రాష్ట్ర అబ్కారీ, క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణ రెడ్డి గారు, ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి గారు, టిజివొ కేంద్ర సంఘం అధ్యక్షురాలు మమత,తదితరులు పాల్గొన్నారు.



విడుదల

ఆలిండియా ఎస్సీ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విడుదల చేశారు. సొసైటీ జాతీయ నాయకులు ఎస్.రాజు,జగన్నాథం, నర్సింగరావు,తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత పల్లె ప్రగతి

- 18 ఏళ్లపైబడిన నిరక్ష్యరాష్యుల జాబితా సిద్ధం చేయాలి
- కలెక్టర్లకు సిఎస్ సోమేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పల్లె ప్రగతి కార్యక్రమంలో 18 ఏళ్ల పైబడి చదవడం రాయడం తెలియని నిరక్ష్యరాష్యుల జాబితాను సిద్ధం చేసి, జనవరి 10వ తేదీలోగా పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమం జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న నేపధ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వయోజనుల అక్షరాస్యతను పెంపొందిచడం కోసం ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సిఎం కెసిఆర్ అక్షరాస్యత పెంపుకోసం అన్ని గ్రామ పంచాయతులలో ఈచ్ వన్...టీచ్ వన్ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారని తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో చదవడం రాయడం రానివారి వివరాలను సేకరించాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామానికి సంభందించిన ఈ జాభితాలో 18 సం. లు పైబడి నిరక్ష్యరాష్యుల అందరి వివరాలు ఉండాలని, 10 తేది వరకు వేచి చూడకుండా ఏ రోజుకు ఆరోజే అప్డేట్ చేయాలని ఆదేశించారు. నిరక్ష్యరాష్యుల వివరాలు సేకరించడానికి సంబందిత ప్రోఫెర్మాను జిల్లా కలెక్టర్లకు పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాష్ రాజ్, సెన్సెస్ డైరెక్టర్ ఇలం బర్తి, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోజ్, పంచాయత్ రాజ్ కమీషనర్ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలకు నిప్పు

- జాతీయ రహదారిపై రాస్తారోకో
- 1075 రకం ధాన్యం కొనాలని డిమాండ్
- వికారాబాద్‌లో పత్తి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం, పత్తి కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకోలు చేశారు. ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ఈ ఘటనలు బుధవారం ములుగు, వికారాబాద్ జిల్లాల్లో జరిగాయి.

1075దొడ్డు రకం ధాన్యం కొనాలని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో సిపిఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు 163వ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మహేంద్ర కుమార్ అక్కడకు చేరుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ పన్నాల ఎల్లారెడ్డి, పస్రా సర్పంచ్ ముద్రబోయిన రాములుతో చర్చించారు. రాస్తారోకో విరమించాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు విరమించేది లేదని రైతులు తేల్చి చెప్పారు. దీంతో పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వివాదం జరిగింది. చివరకు మేడారం జాతరకు సందర్శకులు వస్తున్నారని, వారికి ఇబ్బందులు కలిగించొద్దని కోరగా రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 1075 రకం ధాన్యాన్ని తీసుకొచ్చి నెల రోజులు అవుతున్నా పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేయలేదన్నారు. ఈ ధాన్యం బియ్యానికి పనికిరాకపోతే, ఈ విత్తనాలను రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎందుకు సరఫరా చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సీపీఐ(ఎం) నాయకులు అంబాల కోశాలు, వెంకన్న, చిట్టిబాబు, సామ చంద్రారెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

టోకెన్లిచ్చి తూకాలకు నిరాకరణ

పత్తి మిల్లులో టోకెన్లిచ్చి తూకాలకు నిరాకరించడంతో వికారాబాద్ జిల్లాలో రైతులు ఆందోళన చేశారు. పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కొడంగల్-తాండూర్ రోడ్డుపై బైటాయించారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం...యాలాల మండలం దౌలాపూర్ పంచాయతీ పరిధిలోని శుభం పత్తి మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు 50 మందికిపైగా రైతులకు టోకెన్లిచ్చారు. బుధవారం ఉదయం తూకాలు చేయాల్సి ఉండగా, సెలవు ఉందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. డిసిఎం, ట్రాక్టర్లు, ఆటోలకు రోజురోజుకూ అద్దె పెరగడంతో భారంగా మారిందని రైతులు ఆందోళనకు గురయ్యారు. దాంతో న్యాయం చేయాలని రోడ్డుపై బైటాయించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. పత్తి కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. ప్రభుత్వం సెలవు ప్రకటించడంతోపాటు కార్యాలయంలో కంప్యూటర్లు పనిచేయడం లేదని నిర్వాహకులు చెప్పారు. గురువారం ఉదయం తప్పనిసరిగా పత్తి కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

స్కూటీని ఢీ కొట్టిన అంబులెన్స్

తల్లీ, కుమార్తె దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిలిపి ఉంచిన ఓ స్కూటీని వేగంగా వచ్చిన అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీ,కూతుళ్లు దుర్మరణం చెందారు. స్కూటీని రోడ్డు పక్కన నిలిపి తల్లి తన కూతురును ఎక్కిస్తుండగా వేగంగా వచ్చిన అంబులెన్స్ వారిని ఢీ కొట్టింది. అంబులెన్స్ డ్రైవర్ మద్యం సేవించి, వాహనాన్ని అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. స్కూటీని ఢీకొట్టిన అనంతరం.. అంబులెన్స్ ఓ చెట్టును ఢీకొని ఆగిపోయింది. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర మత్తులో ఉన్నట్లు అక్కడున్నవారు తెలిపారు. మరణించిన వారు చంద్రిక, లాస్యగా గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన తల్లీకూతుర్ల మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో ఉన్న అంబులెన్స్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో బుధవారం జరిగింది. బేగంపేట ఎస్ఐ విజయ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సామలపల్లి గ్రామానికి చెందిన విజయశేఖర్(25) తన నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం చేసిన రూ.3లక్షల అప్పు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురయ్యాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. తన స్నేహితుడైన పరమేశ్‌కు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వెంటనే పరమేశ్, మరో స్నేహితుడు శ్రీకాంత్ కలిసి పొలం వద్దకు వెళ్లారు. విజయశేఖర్‌ను ద్విచక్రవాహనంపై గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది శేఖర్‌ను పరిశీలించి పరిస్థితి విషమంగా ఉందని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే విజయశేఖర్ మృతిచెందాడు. రైతుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతని అన్న చింతస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మజ్లిస్‌తో కలిసి పోటీచేయం

- మా ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్
- సిఎం మార్పుపై ఊహాగానాలు వద్దు
- పాతబస్తికి త్వరలో మెట్రో
- 40ఏళ్లుగా బిజెపిలో మార్పు లేదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మజ్లిస్ పార్టీ తమకు మిత్ర పక్షమేనని..ఎన్నికల్లో ఆపార్టీతో కలిసి సీట్లు పంచుకోమని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు స్పష్టంచేశారు. ఏ ఎన్నికలైనా తమకు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనేఅని అన్నారు. సిఎం కేసీఆర్ మార్పుపై వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. పదేళ్ళ వరకు ఆయనే సిఎంగా ఉంటారని చెప్పారు. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్ హవా కొనసాగుతోందని పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు.

2020-2030 దశకం టిఆర్ఎస్ నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్రానిదేనని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్‌పిఆర్, ఎన్ఆర్‌సిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఏపీ సహా పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో సత్సంబంధాలు కొనసాగిస్తామన్నారు. పిసిసి అధ్యక్ష పదవి వదులుకుంటానని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొనడం ఆయన వ్యక్తిగతమని చెప్పారు. కాంగ్రెస్ సుదీర్ఘ చరిత్ర ఉన్న పార్టీ అని.. దాన్ని తక్కువగా అంచనా వేయబోమని తెలిపారు. తమకు ఇప్పటికీ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సేనని చెప్పారు. తన చిన్నప్పుడు బిజెపి ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందని ఈ సందర్భంగా కేటీఆర్ వ్యాఖ్యానించారు.



కెటిఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న హోంమంత్రి మహమ్మద్ అలీ

ప్రగతిశీల రాష్ట్రాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని.. అందులోనూ రాజకీయాలు ఆలోచిస్తే దేశానికి మంచిది కాదని కెటిఆర్ అభిప్రాయపడ్డారు. ఐదు ట్రిలియన్ డాలర్ల కల సాకారం కావాలంటే రాష్ట్రాలను ప్రోత్సహించాలని సూచించారు. హైదరాబాద్ పాతబస్తీకి మెట్రో రైలు తప్పకుండా వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎంఐఎంతో స్నేహ సంబంధాలు ఉంటాయని.. ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీతో కలిసి పోటీచేసే ప్రసక్తే లేదన్నారు. తమకు రాజకీయాల్లో శత్రువులు ఎవరూలేరని..బిజెపి కాంగ్రెస్ రెండూ తమకు ప్రత్యర్థులేనన్నారు.

టిఆర్ఎస్ రాష్ట్ర కమిటీతో కేటీఆర్ సమావేశం

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహం పైన రాష్ట్ర కమిటీ, సీనియర్ నాయకులతో టిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ నిర్వహించారు. గత వారం జరిగిన సమావేశంలో చర్చించిన పలు అంశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకొని వివరాలు సేకరించాలని గతంలో కేటీఆర్ ఆదేశించారు. అతి త్వరలో పార్టీ అధ్యక్షులు కె చంద్రశేఖరరావు గారు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో ఒక ఉమ్మడి సమావేశాన్ని నిర్వహిస్తారని, పార్టీ అనుసరించే వ్యూహంపై మార్గదర్శనం చేస్తారని ఈ సందర్భంగా కేటీఆర్ తెలియజేశారు. .

శ్రీనివాస చార్య నిరంతర సాహితి హాలికుడు

ప్రజాశక్తి-కల్చరల్

శ్రీనివాస చార్య నిరంతర సాహితి హాలికుడని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో బుధవారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో డాక్టర్ తిరుమల శ్రీనివాస చార్య 83వ జన్మదిన సందర్భంగా ఆయన రచించిన వ్యాస భారతి(వ్యాస సంపుటి) సతీస్మృతి(రుబాయిా కావ్యం) స్నేహసుధా(రుబాయిా కావ్యం) సంపుటిల ఆవిష్కరణ సభ నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎల్లూరి శివారెడ్డి వ్యాస భారతి సంపుటిని ఆవిష్కరించి సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు రాష్ట్రలు పట్టించుకోని మహా పరిశోధకుడు మహాకవి విమర్శకులు శ్రీనివాస చార్యను రస హృదయంతో రాము సమాదరించి ఆయన కావ్యాల ఆవిష్కరణలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. శాంత బయోటెక్నిక్ లిమిటెడ్ చైర్మెన్ డాక్టర్ కెఐ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస చార్య 83ఎండ్ల వయస్సులోను రచనతృష్ణను విడలేదని రూబాయిా ప్రక్రియాల సృష్టికర్తగా గణుతికెక్కారని కోనియాడారు. అనంతరం శ్రీనివాస చార్య తన వ్యాస భారతిని కెఐ వరప్రసాదరెడ్డికి స్నేహసుధా సంపుటిని ఎ.చంద్రమౌళికి లాంచనంగా అంకితమిచ్చారు. పండితులు డాక్టర్ శ్రీరంగాచార్యులు సాహితి వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం కవి సుధామ, పుస్తక శిల్పి టి. మురళీధర్ పాల్గొనగా డాక్టర్ యంకె రాము స్వాగతం పలికారు.ఆశాలత వ్యాఖ్యానంలో కె రామాచారీ బృందం అలపించిన శ్రీనివాస చార్య గీతాలు ఆకట్టుకున్నాయి.



పనిసరే...జీతాల మాటేది?

- రూ.8,500 ఒట్టిమాటేనా!
- పంచాయతీల దగ్గర నిధులు అంతంతే
- పల్లెప్రగతి రెండో విడత వచ్చినా చేతికందని వేతనం
- అయోమయంలో జిపి కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ చెప్పినట్టుగానే గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు 30 రోజుల ప్రణాళికను విజయవంతంగా అమలు చేశారు...ఇప్పుడు రెండో విడతా వచ్చి చేరింది. వారితో పని మీద పని చేయించుకుంటున్న రాష్ట్ర సర్కారుకు వేతనాలు ఇచ్చేందుకు మాత్రం చేయి రావడం లేదు. మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదు. సీఎం చెప్పిన రూ.8,500 వేతనం నాలుగైదు పంచాయతీలకే పరిమితమైంది. పల్లెప్రగతికి రూ.330 కోట్లు ఇచ్చాం...పనులు జరుగాల్సిందే...చేయకపోతే ఉపేక్షించేది లేదు...తొలగిస్తాం అంటూ సమీక్షల మీద సమీక్షలు నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు జీపీ కార్మికుల వేతనాలపై ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం గమనార్హం. తమకు రూ.8,500 వేతనం పెరిగిందని రాష్ట్రంలోని 40 వేల మంది పంచాయతీ కార్మికులు ఎంతో సంబురపడ్డారు. కానీ, వాళ్ల ఆశలపై నీళ్లు చల్లుతూ రాష్ట్ర సర్కారు జీవో నెంబర్ 51 విడుదల చేస్తూ అనేక ఆంక్షలు పెట్టింది. స్వీపర్ దగ్గర నుంచి కారోబార్ వరకు ఎప్పుడు ఏ పని చెప్పినా చేయాలనే నిబంధనను తీసుకొచ్చింది. ఏడాది పాటు పని కల్పిస్తూ ఒప్పంద పత్రాలపైనా బలవంతంగా సంతకాలు పెట్టించుకుంది. చెప్పినట్టు వినకపోతే ఉన్న జాబు ఎక్కడ పోతుందో అన్న భయంతో అందరూ సంతకాలు పెట్టారు. ఊ అంటే...ఆ అంటే...భయపెట్టి పనిగంటలు లేకుండా ఇష్టమొచ్చినట్టు పనిచేయించుకుంటున్నారు. కానీ, జీతాలు మాత్రం ఇస్తలేరు. రూ.8,500 జీతాలను ఇవ్వాలని సర్క్యులర్‌లను పంచాయతీలకు జిల్లా అధికారులు జారీ చేసినప్పటికీ ఎ్కడ కూడా అమలు కావడం లేదు. 'నిధులు ఇవ్వకుండా వేతనాలు ఇవ్వాలంటే ఎక్కడ నుంచి ఇస్తాం. పెంచిన జీతాలియ్యాలని ఇంటి చుట్టు తిరుగుతున్నరు. వాళ్లకు ఏం చెప్పాలో వశం అయితలేదు. మా దగ్గరేమో నిధులు లేవు. అధికారులేమో అడ్జెస్ట్ చేసి ఇవ్వాలంటున్నరు. ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వాలే' అంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ సర్పంచ్ తన ఆవేదన వెళ్లగక్కాడు.

పెద్దపల్లి జిల్లాలో నాలుగైదు పంచాయతీల్లో, నల్లగొండ, వరంగల్ రూరల్ జిల్లాల్లో ఒక్కో పంచాయతీలో, మిగతా జిల్లాల్లో ఒకటి రెండు పంచాయతీల్లో మినహా ఎక్కడ కూడా రూ.8,500 వేతనం ఎక్కడా ఇవ్వట్లేదు. రెండు నెలల నుంచి పెరిగిన జీతాల ఎప్పుడొస్తాయా? అని కార్మికులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడెం పంచాయతీలోనే ఇచ్చారు. పెద్దవూర మండల కేంద్రంలో తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పాత వేతనం ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు.

31 మండలాల్లో మిగతా ఏ పంచాయతీలోనూ రూ.8,500 వేతనం ఇవ్వలేదు. దీంతో 3 వేల మంది కార్మికులు తమ జీతాల కోసం కండ్లండ్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం ఒక్క పంచాయతీలోనే ఇచ్చారు. మిగతా ఏ గ్రామాల్లో వేతనాలు ఇవ్వలేదు. కార్మికులు గట్టిగా అడిగితే ఎక్కడ నుంచి ఇవ్వాలో తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు దాటవేస్తున్నారు. వేతనాల కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తామని రాష్ట్ర సర్కారు చెప్పింది అనుభవపూర్వకంగా వట్టిమాటే అని తేటతెల్లమవుతున్నది. జగిత్యాల జిల్లాలోనూ మూడు, నాలుగు పంచాయతీల్లో సర్పంచులు చొరవ చేసి జీతాలిచ్చారే తప్ప మిగతా ఎక్కడా ఇవ్వలేదు. రూ.8,500 వేతనం కోసం పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు ఎన్ని రోజులు ఎదురుచూడాల్నో?

పల్లె ప్రగతి ముందుకు సాగాలంటే...రూ.8,500 వేతనం చెల్లించాలి

పల్లె ప్రగతి ముందుకు సాగాంటే రూ.8,500 వేతనం చెల్లించాల్సిందేనని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరెడ్డి, చాగంటి వెంకటయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెరిగిన వేతనాలు సెప్టెంబర్ నుంచి చెల్లిస్తామని చెప్పి 30 రోజుల ప్రణాళికలో పనిచేయించుకుని నేటికీ జీతాలు చెల్లించకపోవడం దారుణని పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు 2020 జనవరి 2 నుంచి 12 వరకు జరిగే పల్లె ప్రగతిని జయప్రదం చేస్తే నవంబర్ వేతనాలు చెల్లిస్తామనీ చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. శుక్రవారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జరిపిన సమీక్షా సమావేశంలో కనీసం కార్మికులు, వారి వేతనాల ప్రస్తావన కూడా చేయకపోవడం దారుణమని వాపోయారు. వేతనాల చెల్లింపు జీవో నెం 51 ని సవరించాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 8న ఒక్క రోజు సమ్మె చేయాలని, జనవరి 17న చలో హైదరాబాద్ కమిషనరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పుస్తకమా నేస్తమా మళ్లీ కలుస్తాం

ప్రజాశక్తి-కల్చరల్

పది రోజుల పాటు నిరాటంకంగా తెలంగాణ కళా భారతీ(ఎన్‌టీఆర్ స్టేడియం)లోని పివి నరసింహారావు ప్రాంగణంలో నిర్వహించిన 33వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు బుధవారం తెరపడింది. చివరి రోజు కూడ పుస్తక ప్రియులు సెలవు దినం కావడంతో నిండుగా ప్రాంగణంలో తిరుగాడుతూ తమకు అవసరమైన పుస్తకాల కోసం వెతుకులాట కనిపించింది. ఖరీదైన పుస్తకాలకు తమ వద్ద అంత డబ్బు లేకపోవడంతో మరో 5రోజులు ప్రదర్శన ఉంటే తాము మళ్లీ మళ్లీ వచి తమకు కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేసి ఉండేవారమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

పుస్తక మిత్ర ప్రారంభం

పుస్తక మిత్ర పథకాన్ని గ్రంథాలయ పరిషత్ చెర్మెన్ ఆయాచితం శ్రీధర్ ప్రారంభించారు. వివాహాలకు పుట్టినరోజు వేడులకు ఇతర కార్య క్రమాలకు హాజరయ్యే సందర్భంలో బహుమతుల రూపంలో పుస్తకాలను అందించాలనే ఉద్యమంగా పుస్తక మిత్రను ప్రారంభించారు. గ్రంథాలయ పరిషత్ పస్తుక కొనుగొల్లక 3ప్రభుత్వ ఆదేశాలను జారి చేసింది. పుస్తకాలు కొనేందుకు రచయితలకు ప్రచురణ కర్తలకు అవకాశం కల్పిస్తు పుస్తక మిత్ర పథకాన్ని రూప కల్పన చేశారు.

నవతెలంగాణ ప్రచురణ తెలంగాణ దర్శిని ఆవిష్కరణ

రాఘవాచారీ వేదికపై నవతెలంగాణ ప్రచురించిన తెలంగాణ దర్శిని సంపుటిని ఆయాచితం శ్రీధర్ ఆవిష్కరించి మాట్లాడారు. స్వల్ప కాలంలోనే ఈ పుస్తకం 5ముద్రలను ప్రచురించబడటం అభినందనీయమన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలోని విశేశాలను విజ్ఞానదాయకంగా అందించిందన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ కోశాధికారి రాజేశ్వర్‌రావు అధ్యక్షులు గౌరిశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమన్నారు. కోయ చంద్రమోహన్ అధ్యక్షత వహించారు.

పుస్తక ప్రదర్శన తెలంగాణలో చెరిగినిపోని సంతకం- జూలూరి గౌరిశంకర్

పుస్తక ప్రదర్శన తెలంగాణలో చెరిగిపోని సంతకంగా నిలుస్తుందని హెచ్ఎన్‌బీఎఫ్ అధ్యక్షులు జూలూరి గౌరిశంకర్ అన్నారు. ప్రలజ వద్దకు పుస్తకం పుస్తకం వద్దకు ప్రజలు అనే నినాదంతో హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నమని ఆయన తెలిపారు. తెలంగాణలోని 33జిల్లాలోని పుస్తక ప్రదర్శన విస్తృతంగా ప్రచారం చేసి తెలంగాణ సాహిత్యాన్ని ప్రజల వద్దకు ఉద్యమ స్ఫూర్తితో తీసుకెల్తామన్నారు. భవిష్యత్‌లో అన్ని జిల్లాలోని పుస్తక ప్రదర్శనలు నిర్వహించి సంవత్సరం చివరలో పుస్తక మహోత్సవంలో పుస్తక జెండాను ఎగరవేస్తామని ఆయనన్నారు.

పఠనంతో పాటు అధ్యయనం ముఖ్యం-గోరేటి వెంకన్న

కేవలం పుస్తక పఠనమే కాక సమాజాన్ని ప్రకృతిని ఆధ్యయనం చేసి జ్ఞాన వంతులుకావాలని ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న అన్నారు. సి. రాఘవాచారీ వేదికపై బుధవారం జరిగిన పుస్తక ప్రదర్శన ముగింపు ఉత్సవంలో వెంకన్న పాట మాటతో ఆలోచనాత్మక ప్రసంగం చేశారు. ఆదివాసీల జ్ఞానం ప్రకృతిపరంగా అబ్బిందని చదువుతే ఆలోచనలు మారి మనిషిగా మారే అవకాశంవుందని ఆయనన్నారు. ఎందరో తమ జ్ఞాన సంపదతో ప్రభుత్వ నిరంకుశాత్వన్ని ఎదిరించారని అట్టివారీ గ్రంథల పఠించి స్ఫూర్తి పోందాలన్నారు.

గొల్లపూడి సాహిత్యం ఆలోచనాత్మకం

ప్రజాశక్తి-కల్చరల్

గొల్లపూడి సాహిత్యం ఆలోచనాత్మకమని ప్రముఖ సాహితి వేత్త డాక్టర్ వాణి తుమ్మలపల్లి అన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై నెల నెలా తెలుగు వెన్నెల కార్యక్రమంలో భాగంగా గొల్లపూడి మారుతిరావు సాహిత్య సౌరభాలు అంశంపై డాక్టర్ వాణి ప్రశంసించారు. ముఖ్య అతిధిగా ప్రముఖ రచయిత్రీ డాక్టర్ కెవి కృష్ణకుమారి పాల్గొని మాట్లాడుతూ సినీ రచయితగా నాటక కర్తగా గొల్లపూడి పదునైన సంభాషణలతో హృదయాలను కదిలించారని వివరించారు. వంశీరామరాజు అధ్యక్షత వహించిన సభలో డాక్టర్ తెన్నెటి సుధా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాణి రమణ శిష్యబృందం ప్రశంసించిన కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి.

4 వరకు కామన్ సింబల్ గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్ ఎన్నికల్లో కామన్ సింబల్ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో సింబల్స్ లేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు కామన్ సింబల్ కోసం జనవరి నాలుగవ తేదీలోపు దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువు. రూ.10 వేల డీడీని కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం పేరుతో సమర్పించాలి. కమిషన్ సూచించిన అందుబాటులో ఉన్న గుర్తుల్లో నుంచి ఏవేనీ 10 చిహ్నాలను ప్రాధాన్యతాక్రమంలో పేర్కొనాలి. మొత్తం స్థానాల్లో కనీసం 10 శాతం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనున్నట్టు ప్రమాణపత్రం ఇవ్వాల్సి ఉంటుంది